సాక్షి జగిత్యాల

మంగళవారం । 11 । జూలై । 2023



భగవద్గీతపై ప్రచారం

ధర్మపురి: మండలంలోని రాజారం గ్రామంలో సోమవారం భగవద్గీతపై త్రైత సిద్ధాంత ప్రబోధకులు విస్తృ ప్రచారం చేశారు.



సింగపూర్‌లో బోనాలు

కొండగట్టు : సింగపూర్ తెలుగు సమాజం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సింగపూర్‌లో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0/26.0

ఆకాశం దట్టమైన మేఘాలతో కమ్ముకుని ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి

జగిత్యాలటౌన్: ప్రజావాణి ద్వారా స్వీకరించిన సమస్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలపై 22 దరఖాస్తులు అందాయని తెలిపారు. అభాగ్యుల నుంచి అర్జీలు స్వీకరించిన కలెక్టర్.. జిల్లా నలుమూలల నుంచి భూసంబంధిత, ఉపాధి, పింఛన్లు తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టులో తప్పుడు సమాచారం ఉండొద్దు



మాట్లాడుతున్న స్వదేశీ పరికిపండ్ల

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఉపాధి కోసం గల్ఫ్ తదితర విదేశాలకు వెళ్లే కార్మికులు పాస్‌పోర్టులో తప్పుడు సమాచారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశీ పరికిపండ్ల సూచించారు. వేములకుర్తి గ్రామంలో సోమవారం గల్ఫ్ కార్మికులకు వివిధ అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. తాము వెళ్లే దేశం, పనిపై స్పష్టత ఉండాలనిపాయన చెప్పారు. భారత ప్రభుత్వం జారీచేసిన లైసెన్స్‌డ్ ఏజెంట్‌ను గుర్తించాలని సూచించారు. ఇమిగ్రేషన్ యాక్ట్ – 1983 ప్రకారం లైసెన్స్ లేనివారు, సబ్ ఏజెంట్లు రిక్రూట్ వ్యాపారం చేయడానికి వీలు లేదని ఆయన అన్నారు. ప్రతినిధులు చాట్ల గణేశ్, గుమ్మల నరేశ్, రాధారాపు దేవదాస్, బాస మల్లేశ్, దొత్తి రాజరెడ్డి, రాజ్‌కుమార్, నారాయణ, దొనికెన రాజేశ్, పెంట లింబాద్రి, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థి

సారంగాపూర్(జగిత్యాల): రంగపేట ప్రాథమిక, ఉన్నత, తుంగూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో భీమయ్య, జిల్లా సమన్వయకర్త(సెక్టోరియల్ అధికారి) కొక్కుల రాజేశ్ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక పఠనం అలవరుచుకుంటే భవిష్యత్‌లో ఉన్నతులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచి, వారికి పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగేలా కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు జయసింహారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై పనిభారం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): తెలంగాణ ప్రభుత్వం గ్రామపంచాయతీ సిబ్బందితో వెట్టిచాకిరీ చేయిస్తోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులు మూడురోజుల సమ్మె శిబిరాల్లో ఆయన సోమవారం పాల్గొని సంఘీభావం తెలిపారు. పంచాయతీల్లో నలుగురు సిబ్బంది అవసరం ఉంటే అందులో ఇద్దరికి రూ.8,500 చొప్పున నెల వేతనం చెల్లిస్తూ.. దానినే నలుగురు పంచుకోవాలని సూచించడం అన్యాయమన్నారు. నాయకులు గుండ మధు, కోంద్ర రాంచంద్రారెడ్డి, ఆకుల జమున, రామడుగు రవి, మాలెపు విమల తదితరులు ఉన్నారు.

జాతి పునర్నిర్మాణమే లక్ష్యం

జగిత్యాలటౌన్: జాతీ పునర్నిర్మాణమే లక్ష్యంగా ఏబీవీపీ ముందుకు సాగుతోందని విద్యార్థి సంఘం నేత మురళి అన్నారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం పట్టణంలో విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్వామీ వివేకానంద స్ఫూర్తితో జ్ఞానం, శీలం, ఏకత సూత్రాల ఆధారంగా ఏబీవీపీ పనిచేస్తోందని ఆయన అన్నారు. విద్యార్థి సమస్యలు పరిష్కరిస్తూ, విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థుల్లో నూతనత్వం, సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాపాక సాయికుమార్, నాయకులు రెంటం జగదీశ్, మల్లేశ్, మహేందర్, శ్రీను, మనోహర్, వినయ్, నందు ఉన్నారు.

రహదారులు ఛిద్రం



అసలే వర్షాకాలం.. తేలిక పాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారుతున్నాయి.. అడుగుతీసి అడుగు వేయాలంటే.. ఎక్కడగొయ్యి ఉందో తెలియని పరిస్థితి.. వానాకాలానికి ముందే వీటిని మరమ్మతు చేసి ఉంటే తిప్పలు తప్పేవి.

– కోరుట్ల ప్రకాశం రోడ్డుకు చెందిన చారి ఆవేదన ఇది.



మాది కోరుట్లలోని పటేల్ రోడ్డు.. మా కాలనీ సందు చాలాచిన్నగా ఉంది. ఈ రోడ్డు నుంచే కాల్వగడ్డకు వెళ్తారు. రోడ్డంతా గతుకులే.. వానలు పడితే మరింత ఇబ్బందిగా ఉంటుంది.

– ఇది కంటాల భాస్కర్ ఆవేదన..

- కోరుట్ల మున్సిపాల్టీలోనే ఈ పరిస్థితి లేదు.. జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ బల్దియాల్లోనూ ఉంది. ఏళ్ల క్రితం నిర్మించిన సీసీ రోడ్లు, గత వానాకాలంలో దెబ్బతిన్న వాటికి మరమ్మతు విస్మరించడం, మట్టిరోడ్లు కావడంతో గుంతలమయమయ్యాయి. ప్రధాన రహదారులపైనే దృష్టి సారిస్తున్న పాలకవర్గాలు.. అంతర్గత రహదారులను విస్మరించడంపై పురప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఏళ్లు గడిచినా జాడలేని మరమ్మతులు
- పట్టింపులేని బల్దియా పాలకవర్గాలు
- అధ్వానంగా తయారైన అంతర్గత రోడ్లు
- మున్సిపాల్టీల్లో తప్పని 'వర్షాకాలం' తిప్పలు



చిరుజల్లులకే చిత్తడిగా మారిన జగిత్యాలలోని విద్యానగర్ అంతర్గత రహదారి



కోరుట్లలోని రూూప్సీరోడ్డు దుస్థితి ఇదీ..



ఇబ్బందులు రానివ్వం



బల్దియాలోని కొన్నిచోట్ల అంతర్గత రోడ్లు బాగా లేవన్న మాట వాస్తవమే. వాటి మరమ్మతులకు అవసరమైన నిధులు జనరల్ ఫండ్ నుంచి కేటాయిస్తాం. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు ప్రారంభించాం. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల



ఆనవాళ్లులేని మెట్‌పల్లిలోని సుల్తాన్‌పురా రోడ్డు

కోరుట్ల: జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి, రాయికల్ మున్సిపాల్టీల్లోని 80శాతం ప్రధాన రహదారులను సీసీరోడ్లుగా అభివృద్ధి చేశారు. జగిత్యాలలోని బైపాస్, యావర్‌రోడ్డు, టవర్ సర్కిల్ రోడ్లను బీటీగా మార్చారు. కోరుట్లలో మెయిన్‌రోడ్డు, కాల్వగడ్డ రోడ్డు, గాంధీ రోడ్డు, టీచర్స్ క్లబ్ రోడ్లనూ ఇటీవల బీటీ రహదారులుగా అభివృద్ధి చేశారు. దీంతో ప్రజల ఇబ్బందులు కొద్దిగా తొలగిపోయాయి. మెట్‌పల్లిలో కేవలం మెయిన్‌రోడ్డు మాత్రమే బాగా ఉంది. రాయికల్, ధర్మపురిలోనే ప్రధాన రహదారులు పెద్దగా దెబ్బతినలేదు. మున్సిపాల్టీల్లో ఇటీవల అంతర్గతంగా సీసీ రోడ్లు నిర్మిస్తున్నా.. పనులు ఇంకా పూర్తికాలేదు.

అంతర్గరోడ్లు అధ్వానం..

- జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాల్టీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి.
- శివారు ప్రాంతాల్లో చాలామేర ఇంకా మట్టి రోడ్లే దర్శనం ఇస్తున్నాయి.
- దీంతో వర్షాలు కురవగానే బురదగా మారుతున్నాయి.
- రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- పట్టణాల మధ్య ఉన్న రోడ్లు ఇదివరకు సీసీ రోడ్లుగా మార్చినప్పటికీ.. ఐదు నుంచి పదేళ్లు గడిచాయి.
- దీంతో ఎక్కడికక్కడే కంకర తేలి, గుంతలుపడి వాహనాలు నడపడటం కష్టతరంగా మారింది.
- కేవలం ప్రధాన రహదారులను మాత్రమే బాగుచేస్తున్న అధికారులు.. అంతర్గత రహదారులను పట్టించుకోవడంలేదు.
- వాటికి నిధులు కేటాయించడంలో పెద్దగా శ్రద్ధ చూపడం లేదు.
- పైపై మెరుగులతో ప్రధాన రహదారులను బాగు చేయడానికి చూపుతున్న శ్రద్ధ.. అంతర్గత రోడ్లపై చూపితే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.
- పాలకులు స్పందించాలని కోరుతున్నారు.

నోట్‌బుక్కులు రాలె!

- ఈ ఏడాది విద్యార్థులకు నోట్‌బుక్కులు ఉచితం
- 6–12 తరగతులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ట్రాన్స్‌పోర్టు కోసం కూడా విడుదలైన డబ్బులు
- ఉమ్మడి జిల్లాలో ఏ పాఠశాలకూ అందని నోట్‌బుక్కులు
- సమీపిస్తున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు



జిల్లా	అందాల్సిన నోట్‌బుక్కులు
కరీంనగర్	2,66,121
జగిత్యాల	3,88,730
పెద్దపల్లి	2,10,618
రాజన్న సిరిసిల్ల	2,41,712

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం ఈఏడాది విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత నోట్‌బుక్కుల పంపిణీ ఇంకా అమలుకు నోచుకోలేదు. తెలంగాణ సమగ్రశిక్షా కింద.. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో అందజేసేందుకు ఏర్పాట్లు చేసేందుకు సిద్ధపడింది. సాధారణంగా ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం, నిధులు విడుదల కాకపోవడం, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం తదితర కారణాలతో ప్రభుత్వ పథకాలు అమలుకు నోచుకోవు. కానీ.. విచిత్రంగా ఈ విషయంలో మాత్రం ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు పూర్తయింది. అంతే కాదు నోట్‌బుక్కులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పాఠశాలలను చేరేందుకు కావాల్సిన రవాణా చార్జీలు కూడా కేటాయించింది. అయినప్పటికీ నేటికీ అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సమీపిస్తున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్..

వాస్తవానికి ఈవిద్యా సంవత్సరం 2023–24లో భాగంగా గతనెల జూన్ 2వ తేదీ నుంచి సర్కారు పాఠశాలల్లో ప్రవేశాలు మొదలయ్యాయి. తొలిపది రోజులు తెలంగాణ దశాబ్ది వేడుకలే జరిగాయి. అనంతరం పాఠ్యపుస్తకాలు కూడా పాఠశాలలకు చేరుకోవడంతో ఉపాధ్యాయులు పాఠాలు మొదలుపెట్టారు. ఈ ఏడాది నోట్‌బుక్కులు కొనుక్కోనవసరం లేదని అన్ని స్కూళ్లలో ముందే విద్యార్థులకు చెప్పడంతో వారంతా కొనలేదు. కానీ.. హైస్కూల్ విద్యార్థులకు ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు నోట్ బుక్కులు చాలా కీలకం. అందులోనూ ఫార్మాటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీచర్లు బోధించిన పాఠాలు రాసుకునేందుకు చాలామందికి నోట్‌బుక్కులు కరువయ్యాయి. వాస్తవానికి నోట్‌బుక్కుల జాప్యంతో ఇప్పటికే కొన్నిచోట్ల విద్యార్థులు కొనుక్కుని వస్తున్నారు. అదేసమయంలో పేద విద్యార్థులు మాత్రం ప్రభుత్వంపై ఆశతో ఉన్నారు.

ఏ విద్యార్థికి ఎన్నినోట్ బుక్కులు?

ప్రతీ హైస్కూల్ విద్యార్థికి తరగతి గదిలో చెప్పే పాఠాలను నోట్ చేసేకునేందుకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అందరికీ ఉచిత 200 పేజీల నోట్‌బుక్కులు ఈవిద్యా సంవత్సరం నుంచి 'తెలంగాణ సమగ్ర శిక్షా' కింద ఇచ్చేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఈ మేరకు 33 జిల్లాల విద్యాశాఖాధికారు(డీఈవో)లకు సమాచారాన్ని గత జూన్ 6వ తేదీన చేరవేసింది. 6వ, 7వ తరగతి విద్యార్థులకు 6 నోట్‌బుక్కుల చొప్పున, 8వ తరగతికి 7 బుక్కులు, 9వ, 10వ తరగతులకి 14 నోట్ బుక్కులు, 11వ, 12వ తరగతులు(ఎంపీసీ, సీఈసీ, బైపీసీ తదితరాలు) 12 నోట్‌బుక్కులు ఇవ్వాలని స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ వెల్లడించారు. 33 జిల్లాల డీఈవోలు ఈ నోట్‌బుక్కులను అన్ని మండలాలకు పంపాలని, అక్కడి నుంచి ఎంఈవోలు పాఠశాలలకు తరలించాలని సూచించారు. ఈ క్రమంలో ఎక్కడ నోట్‌బుక్కుల కొరత ఏర్పడినా ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని స్పష్టంచేశారు.

నిధులు విడుదలైనా..

నోట్‌బుక్కుల రవాణా కింద ప్రతీ పాఠశాలకు నిధులు కేటాయించింది. జిల్లాకు రూ.2 లక్షల చొప్పున ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇందులో రూ.48,000 ఎస్సీ, రూ.28,000 ఎస్టీ కంపోనెంట్లుగా, మిగిలిన రూ.1,24,000 జనరల్ కంపోనెంట్‌గా పేర్కొంది. ఈలెక్కన ఉమ్మడి జిల్లాకు రవాణా కింద రూ.8 లక్షలు వస్తాయన్నమాట. అయితే, ఆదేశాలు వచ్చినప్పటికీ.. ఇంకా ఈ నోట్‌బుక్కులు జిల్లాలకు చేరుకోకపోవడంతో డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు విద్యార్థులకు ఏమీ చెప్పలేకపోతున్నారు.

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	విద్యార్థులు
కరీంనగర్	623	2,787	36,775
జగిత్యాల	748	3,915	65,632
పెద్దపల్లి	580	2,423	45,626
రాజన్న సిరిసిల్ల	510	2,651	37,803

(నోట్: ఈ గణాంకాలకు గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు అదనం)



అర్హులందరికీ ఓటుహక్కు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో 18ఏళ్ల వయసు నిండిన ప్రతీఒక్కరికి ఓటుహక్కు కల్పించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులపై నిర్ణీత ఫారంలు వినియోగించే అంశాలపై ప్రజలకు వివరించాలని చెప్పారు. ఫారం 6 అభ్యంతరాలు, ఫారం7 తొలగింపులు, ఫారం 8 ద్వారా మార్పులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంగవైకల్యం ఉన్నవారు తమ పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు.

ప్రతీఇంట్లో మరుగుదొడ్డి..

స్వచ్ఛ భారత్ మిషన్ కింద జిల్లాలో గుర్తించిన 15 గ్రామాల్లో విజిలెన్స్ సెల్ఫ్ అసెస్మెంట్ క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని కలెక్టర్ అన్నారు. ఇంటింటా మరుగుదొడ్డి ఉండాలని చెప్పారు. ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని, తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలన్నారు. మంగళవారం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ పరిశీలనలో ప్రతీ అధికారి 20 ఇళ్లను తప్పనిసరిగా పరిశీలన చేసి ఇంకుడుగుంత, కిచెన్ గార్డెన్, మరుగుదొడ్డి, రెండు చెత్తబుట్టలను పరిశీలించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. డయేరియా, మలేరియా వంటి వ్యాధులు నమోదు కాకుండా చూడాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. విద్యాసంస్థలు, వసతి గృహాల్లో వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు వేడి భోజనం, తాగునీరు అందించేలా చూడాలన్నారు. పూలకుండీలు, కూలర్లు, కొబ్బరిబొండాలు, నీటి నిల్వలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎంహెచ్‌వో శ్రీధర్‌మాట్లాడుతూ, ఈనెల 3 నుంచి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదనపు కలెక్టర్లు లత, మకరంద్, డీఆర్డీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యమే కారణం



మాట్లాడుతున్న ప్రతినిధులు

జగిత్యాల: స్థానిక మాతా శిశు కేంద్రంలో ఆర్నెల్ల క్రితం గర్భిణులు మృతిచెందిన విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు ఆవేదన చెందారు. ఈ విషయంపై సోమవారం రోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. మాతా శిశు సంక్షేమ కేంద్రంలో గర్భిణులు మృతిచెందిన సంఘటనపై లోకాయుక్త, హైకోర్టులో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికీ ఆస్పత్రిలో పరిస్థితుల్లో మార్పులేదన్నారు. ఆస్పత్రి నిర్వహణ సరిగా లేదని, పసిపిల్లలు చనిపోతున్నట్లు మా సంస్థ దృష్టికి వస్తోందని అన్నారు. ఈ ఘటనలపై ప్రత్యేకాధికారిని నియమించి విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు గంగారాం, కన్వీనర్ రవీందర్, ప్రతినిధులు అనిల్, జలజ, రాణి, శైలజ, పద్మ, సరిత పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమణకు కవిత పరామర్శ



ఎల్లేరామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు

జగిత్యాల: ఎమ్మెల్సీ ఎల్.రమణ తండ్రి ఎల్లేరామ్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. దీంతో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం రమణ నివాసానికి చేరుకున్నారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. తొలుత ఎల్లేరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ రాజేశంగౌడ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బాపురెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, జెడ్పీటీసీలు, ఎంపీపీలు తదితరులు కవితకు ఘనస్వాగతం పలికారు. అనంతరం కవిత వారితో సమావేశం నిర్వహించి జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. జగిత్యాల మేదిని కళాక్షేత్రం చేపట్టిన బోనాల పండుగ ప్రచార పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు దివ్యాంగులు ఆమెకు ఒక వినతిపత్రం అందజేశారు.

ఎమ్మెల్సీని కలిసిన ఈజీఎస్ ఉద్యోగులు

జగిత్యాలరూరల్: తమకు పేస్కేలు అమలు చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని ఉపాధిహామీ ఉద్యోగ జేఏసీ నాయకులు ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం సమర్పించారు. కవిత మాట్లాడుతూ, ఉపాధిహామీ ఉద్యోగులను హామీలను ప్రభుత్వం త్వరలోనే నెరవేర్చుతుందన్నారు. జేఏసీ చైర్మన్ తిరుపతిరావు, ఏపీవో గంగలక్ష్మణ్, టీఏ దయాకర్, ఈసీ మనోజ్, సీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలపై దృష్టి సారించండి

జగిత్యాలటౌన్: 16ఏళ్లుగా రెండో ఏఎన్‌ఎంలుగా సేవలు అందిస్తున్న తమ సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపాలని రెండో ఏఎన్‌ఎంలు కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ కవితను వారు కలుసుకుని ఒక వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో మమత, జయసుద, పద్మ, శైలజ, గూడూరి జయప్రద, నీరజ తదితరులు ఉన్నారు.

రైతులే కాడెడ్లుగా..





మల్లాపూర్(కోరుట్ల): సుమారు 50ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ నిర్మాణంతో కుస్తాపూర్ గ్రామం ముంపునకు గురైంది. నిర్వాసితులకు మల్లాపూర్‌లో పునరావాసం కల్పించారు. ఈ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమి తక్కువ. అందుకే వ్యవసాయానికి అయువుపట్టు లాంటి పశుపోషణ కాలక్రమేణా కనుమరుగైంది. అయితే, మొక్కజొన్న పంట పండిస్తున్న రైతులు.. తామే కాడెద్దులుగా మారి కలుపుమొక్కలు ఇలా ఏరివేస్తున్నారు. ఇలా చేయనివారు కూలీలకు రోజూ రూ.400 నుంచి రూ.500 వరకు వెచ్చించి కలుపు తీయిస్తున్నారు. గ్రామానికి చెందిన రైతులు మంగాళారపు లక్ష్మి, పుప్పాల మల్లేశ్, జార్ల పోశెట్టి తమ ఎకరం మొక్కజొన్న చేనులో సోమవారం కాడెద్లుగా మారి కలుపు మొక్కలు ఇలా తొలగించారు.

నల్లచీరలతో నిరసన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

జగిత్యాలటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ సిబ్బంది నల్లచీరలు ధరించి కలెక్టరేట్ సోమవారం బైఠాయించారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, పింఛన్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ముదుగం రాజలింగం, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ నరేశ్‌కు సన్మానం

మల్యాల(చొప్పదండి): కరోనా సమయంలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా సేవలందించడంతోపాటు నిరుపేదలకు అండగా నిలుస్తున్న మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఆగంతపు నరేశ్‌కు విశ్వగురు వరల్డ్ రికార్డు అవార్డుతో సత్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నరేశ్‌కు అవార్డు కమిటీ, ఆయనను సన్మానించి, ప్రశంసాపత్రం అందజేశారు. నరేశ్ ప్రస్తుతం నల్గొండ జిల్లాలో ఎండీ.పీడియాట్రిక్స్ చదువుతున్నారు.

కుక్కలకు కుటుంబ నియంత్రణ

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇటీవల కుక్కల బెడద తీవ్రమైంది. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులతో మున్సిపల్ అధికారులు స్పందించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. ఈమేరకు సిరిసిల్ల పట్టణ పరిధిలో సంచరిస్తున్న వీధికుక్కలను సోమవారం బంధించి తీసుకెళ్తున్నారు. ఒక్కో కుక్కకు రూ.600 చెల్లించేందుకు కాకినాడకు చెందిన కుక్కలను పట్టే బృందంతో ఒప్పందం చేసుకున్నారు. ఇలా పట్టుకెళ్లిన కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి తిరిగి వదిలేస్తున్నారు.

దంపతులను ఆస్పత్రికి తరలించిన ఎస్సై

ధర్మపురి : ద్విచక్రవాహనంపై నుంచి ప్రమాదశాత్తు కిందపడటంతో భార్యభర్తలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురి – బుద్దేశ్‌పల్లె మధ్య జాతీయ రహదారిపై ఉన్న గుంతలోపడి భార్యభర్తలకు గాయాలయ్యాయి. ఎస్సై దత్తాత్రి చేరుకొని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తుల సహకారంతో రోడ్డుపై గుంతను పూడ్చివేశారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- దొంగలిద్దరూ అన్నదమ్ములే
- అరెస్టు చేసిన పోలీసులు
- సుమారు రూ.5.40 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం


దొంగల అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: జల్సాలకు అలవాటుపడి, దొంగతనాలు చేస్తున్న ఇద్దరిని కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ తుల శ్రీనివాసరావు వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొత్తపెల్లి మండలంలోని రేకుర్తి విజయపురి కాలనీకి చెందిన కుంచం అశోక్, అతని తమ్ముడు రవి జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలనుకున్నారు. కరీంనగర్‌లో తాళం వేసి ఉన్న పలు ఇళ్లకు కన్నం వేసి, బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు. వరుస చోరీ ఘటనలను సవాల్‌గా తీసుకున్న పోలీసులు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ దొంగల కదలికలపై దృష్టిపెట్టి, సోమవారం చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5.40 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు.

క్రీడా పాఠశాలల జిల్లాస్థాయి పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 4వ, 5వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు సోమవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 4వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 16 మండలాల నుంచి 40 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో అత్యధిక పాయింట్లు సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన విద్యార్థులు మంగళవారం రావొచ్చని చెప్పారు. పీడీలు రాజిరెడ్డి, నర్సయ్య, అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, కొమురోజు కృష్ణ, హన్మంతు, జిట్టబోయిన శ్రీనివాస్, 36 మంది పీఈటీలు పాల్గొన్నారు.


మెడిసిన్ బాల్ త్రో పోటీని పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ రాజవీరు తదితరులు

సీసీ కెమెరాలు దగ్ధం

కొండగట్టు(చొప్పదండి) : కొడిమ్యాల మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నిఘానేత్రాల స్టోరేజ్ కోసం ఏర్పాటు చేసిన డీవీఆర్ పవర్ సప్లయ్ బాక్స్ ఆదివారం అర్ధరాత్రి కాలిపోయింది. గ్రామంలో పోలీసులు సీసీకెమెరాలు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన డీవీఆర్ పవర్ సిస్టమ్‌తో పాటు మూడు నిఘానేత్రాలు కాలిపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొందరు ఇసుక, గంజాయి, అక్రమ రవాణా చేసే వ్యక్తులే బాక్స్‌ను కాల్చివేసి ఉంటారని గ్రామస్తులు అనుమనిస్తున్నారు. దీనిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మెట్‌పల్లి(కోరుట్ల): నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న కట్ట మనోజ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మనోజ్ కొంతకాలంగా విదేశాల్లో విద్యనభ్యసించడానికి వెళ్తున్న యువకులకు అవసరమైన వివిధ కోర్సులకు సంబంధించిన సర్టిఫికెట్లు అందిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే మెట్‌పల్లిలోని కళానగర్‌కు చెందిన బండ గణేశ్‌కు డిగ్రీ సర్టిఫికెట్ ఇచ్చి వీసా ప్రాసెస్ కోసం పంపాడు. అది రిజెక్ట్ కావడంతో అనుమానం వచ్చిన గణేశ్.. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. దీంతో అది నకిలీ సర్టిఫికెట్ అని తేలింది. దీంతో మనోజ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ధాన్యం కొనుగోళ్లపై విచారణ

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కందెనకుంటలో బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరిగాయని రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై సంఘ అధ్యక్షుడు ముప్పాల రాంచందర్‌రావు, సీఈవో అయ్యోరి తిరుపతి ఆధ్వర్యంలో విచారించారు. కేంద్రంలో నర్సింహులపల్లె రైతులు ధాన్యం ఆరబోశారు. కొనుగోళ్ల వివరాలను ట్యాబ్ ఎంట్రీ చేసే వ్యక్తి కొంతమంది రైతులు డబ్బులను ఇతర రైతుల అకౌంట్లలోకి జమచేయడం, ధాన్యం అమ్మిన బస్తాల ఆధారంగా డబ్బులు జమకాకపోవడంపై విచారించారు. ట్యాబ్ నిర్వాహకురాలు అవినీతికి పాల్పడినట్లు గుర్తించి ఆమెను బాధ్యతల నుంచి తొలగించారు. రైతులకు నష్టంకాకుండా అందరి డబ్బులు అందజేస్తామని సదరు నిర్వాహకురాలు అంగీకరించినట్లు రైతులు తెలిపారు. విండో చైర్మన్ ముప్పాల రాంచందర్‌రావు, సీఈవో అయ్యోరి తిరుపతి, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు కొల్ముల రమణ, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ ఎడ్ల సుజనా సునీల్, సంఘం డైరెక్టర్లు చెర్పూరి సుభాశ్, నర్మట్ల సతీశ్, తదితరులున్నారు.


విచారణ జరుపుతున్న సంఘం అధ్యక్షుడు, సీఈవో

ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి

- ఎమ్మెల్సీ కవిత


ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం పలుకుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు

జగిత్యాలజోన్: జగిత్యాల జిల్లాలో అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని ఎమ్మెల్సీ కవిత స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం జగిత్యాల జిల్లా ప్రజాపరిషత్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. తొలుత జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులు కవితను సన్మానించారు. అనంతరం జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల గురించి జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజల్లోకి వెళ్లాలన్నారు. జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీలు

- ఎన్నికలు వస్తుండటంతో తెరమీదకు బీసీ బంధు పథకం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గంగాధర: పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు వొడ్నాల యగ్నేశ్ ఆధ్వర్యంలో, టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సమక్షంలో సోమవారం పలువరు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. రైతులకు చేస్తామన్న రూ.లక్ష రుణమాఫీ ఐదేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదన్నారు. మద్దతు ధరతో ధాన్యం కొంటామని క్వింటాల్‌కు 10 కిలోలు దోచుకుంటున్నారని, రైతుబంధు పేరు చెప్పి, రైతుల సబ్సిడీలకు ఎగనామం పెట్టారని మండిపడ్డారు. 1.91 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ అవినీతిమయం అయిందన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసింది లేదని, ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామని ఏడాది గడిచినా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఓట్ల కోసం తీసుకువచ్చిన దళితబంధు పథకం పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, ప్రస్తుతం ఎన్నికలు వస్తుండటంతో బీసీ బంధు పథకాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని కోరారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. తాను రెండుసార్లు ఇక్కడి నుంచి పోటీ చేసి, ఓడిపోయినా ప్రజలు, రైతుల సమస్యలపై పోరాటం చేస్తున్నానని అన్నారు. నాపై గెలిచిన బొడిగ శోభ, సుంకె రవిశంకర్‌లు ధనార్జనే ధ్యేయంగా పని చేశారని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో తనను దీవిస్తే ప్రజాసేవకు అంకితమవుతానని పేర్కొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

జగిత్యాలటౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు డిమాండ్‌ చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదనే ఆగ్రహంతో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం బైఠాయించి నిరసన తెలిపారు. సుతారి రాములు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం వండి వడ్డించే మధ్యాహ్న భోజన కార్మికులకు కొన్నినెలలుగా మెస్, కోడిగుడ్ల బిల్లులు విడుదల కావడం లేదన్నారు. తమ యూనియన్ చేపట్టిన పోరాటాల ఫలితంగా గత ఫిబ్రవరి 15న వేతనాలు పెంచుతూ ప్రభుత్వం జీవో నంబరు 8 జారీ చేసిందని తెలిపారు. అయినా, పెంచిన వేతనాలు ఇంకా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. విద్యాశాఖ డైరెక్టర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, విద్యాశాఖ మంత్రి, కలెక్టర్లు, డీఈవోలకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వంటలు మానేసి సోమవారం నుంచి సమ్మె చేయక తప్పని పరిస్థితి నెలకొందని వివరించారు. వంట కార్మికులను విధుల్లోంచి తొలగించే చర్యలు ఆపాలని, గుర్తింపు కార్డులు, నియామక పత్రాలు అందజేయాలని కోరారు. కేరళ ప్రభుత్వం తరహాలోనే కనీస వేతనం రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ చెన్నవేని దశరథం, కో కన్వీనర్ హన్మంతు, కార్మిక సంఘం నేతలు కొంక భాగ్య, పద్మ, ఎండీ రజియా, అక్కవ్వ, సఫియా, లక్ష్మి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు షూస్, సాక్స్‌ల పంపిణీ

జగిత్యాల జోన్: జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేటకు చెందిన న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డికి పుట్టిన ఊరిపై ప్రేమ. ఇప్పటికే గ్రామంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాడు. తన కొడుకు నాగిరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 150 మంది విద్యార్థులకు షూస్, సాక్స్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు శ్రీనివాస్ రెడ్డి, దాత నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, ఎంఈవో గాయత్రిదేవి, సర్పంచ్ జక్కుల తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, చంద్రమౌళి, కమలారాణి, ఎస్ఎంసీ చైర్మన్ గంగాధరి సౌమ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్ : కొండగట్టు దర్శనానికి వెళ్లిన 12 మంది భక్తుల మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల రెండో అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ వినిల్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రజని కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం ధర్మోరాకు చెందిన 60 మంది భక్తులు మార్చి 20, 2012, (ఏపీ 16 యు–8959)న లారీలో ఆంజనేయ స్వామి దర్శనానికి కొండగట్టు వెళ్లారు. మరుసటి రోజు దర్శనం చేసుకున్న అనంతరం కొంతమంది భక్తులు కొండకిందికి వెళ్లేందుకు లారీ ఎక్కారు. అయితే లారీ స్టార్ట్ కాకపోవడంతో కొందరు భక్తులు లారీ దిగి, వెనుక నుంచి నెట్టారు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో మూల మలుపు వద్ద లోయలో పడింది. లారీలో ఉన్న తిరుపతి, ఇట్టడి సాయన్న, ఆడెపు రమేశ్, ఆడెపు సాయన్న, దుగ్గెన శ్రీనివాస్, అల్లాల రాజేశ్వర్, పాలెపు గంగాధర్, ఆడెపు రోహిత్, చిలకరి విఘ్నేష్, మందల ఆశు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో లారీ డ్రైవర్ మహంతి సత్యనారాయణపై మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి జగిత్యాల ఏఎస్పీ, ప్రస్తుత రామగుండం సీపీ రెమా రాజేశ్వరి కేసు దర్యాప్తు చేశారు. లారీ డ్రైవర్ మహంతి సత్యనారాయణను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎ. కిరణేశ్వర స్వామి, కిరణ్ కుమార్ సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టగా లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సారంగాపూర్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్‌పల్లికి చెందిన ఇడగొట్టు సంతోష్ ఆదివారం రాత్రి తన బైక్‌పై సారంగాపూర్ వెళ్తున్నాడు. అదే సమయంలో గోగుల సంతోష్ మరో ద్విచక్రవాహనంపై గణేశ్‌పల్లి వైపు వెళ్తుండగా రెండు వాహనాలు ఢీకొనడంతో ఇడగొట్టు సంతోష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్ తండ్రి ఇడగొట్టు గోవింద్ ఫిర్యాదు మేరకు గోగుల సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

కోరుట్ల: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన రేపల్లి నరేశ్ (27) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. తాగుడుకు బానిసైన నరేశ్ ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అల్లమయ్య గుట్ట ప్రాంతంలో ఉన్న వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకొని యువతి..

రాయికల్: పట్టణంలోని షేక్ సోని (21) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. షేక్ సోని కడుపునొప్పితో బాధపడుతుండగా, ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుంది. స్థానికులు రాయికల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి తండ్రి సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మద్దులపల్లిలో వృద్ధుడు..

పెగడపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన ఆరెల్లి నర్సయ్య (60) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్ సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్సయ్య కొంతకాలంగా ఏ పని చేయకుంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం తాగిన మైకంలో ఇంట్లోంచి వెళ్లిన నర్సయ్య గ్రామశివారులోని మామిడితోటలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు

'రేషన్ డీలర్‌ను తొలగించాలి'

మల్లాపూర్ : నిబంధనలు పాటించకుండా లబ్ధిదారుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న రేషన్ డీలర్‌ను తొలగించాలని తహసీల్దార్ రవీందర్‌కు సోమవారం ప్రజావాణిలో కుస్తాపూర్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన రేషన్ డీలర్ ఈరవత్రి గంగాధర్ బియ్యం పంపిణీలో సరిగా తూకం వేయడం లేదని, రేషన్ దుకాణం వద్దకు వచ్చే లబ్ధిదారుల పట్ల దుర్భాషలాడుతున్నారన్నారు. సమయపాలన లేకుండా బియ్యం పంపిణీ చేస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ద్యాగ గంగారెడ్డి, సరికెల మహిపాల్, నర్సయ్య, చిన్నమల్లయ్య, రాజేందర్, రాజన్న, భూమయ్య, గంగాధర్, మామిడి లచ్చన్న, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.